

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం, జూలై 17 : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ పార్టీ రైతును రాజు చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి సాక్షిగా ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాట నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా.. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్, మహిళలకు రూ.2500 సహాయం వంటి హామీలను ఇప్పటికే అమలుచేస్తున్నాం. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తున్నదన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, అందులో భాగంగానే ఎమ్మెల్యేలు కూడా అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు.

**అసంపూర్తి పనులు పూర్తిచేయాలి**

అసంపూర్తిగా ఉన్న ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని తక్షణమే పూర్తిచేయాలని ఎమ్మెల్యే డీఆర్‌డీవీ అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో తహసీల్దార్ కార్యాలయం పనులు ప్రారంభం కావాలన్నారు. మధ్యలో నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను కూడా వెంటనే పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువుకుంటల కబ్జాలను అధికారులు అరికట్టాలన్నారు. రైతులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీని రద్దుచేయించామన్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో 20వేల ఎకరాల్లో సకల సౌకర్యాలతో కూడిన టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం ప్రకటించారన్నారు. మిగిలిన ప్రాంతంలో ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించే పొల్యూషన్ రహిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఫార్మాసిటీకి భూములివ్వని రైతులపై ఎలాంటి ఒత్తిడి చేసినా సహించేదిలేదని, భూములివ్వని రైతుల వద్దకు ఎవరూ వెళ్లరని ఎమ్మెల్యే తెలిపారు.

# వైభవంగా తొలి ఏకాదశి

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసి మొక్కుల చెల్లింపు



కడ్తాల్ : లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమనగల్లు : స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



తుర్కయాంజాల్ : కమ్మగూడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

రంగారెడ్డి జిల్లాలో తొలి ఏకాదశి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాలను అందంగా అలంకరించారు. భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ఉండి ఆయా దేవాలయాల్లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అభిషేకాలు, విశేష హారతులు, తులసి అర్చన, విష్ణు సహస్రనామ పారాయణం, సత్యనారాయణస్వామి వ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించి పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. కీర్తనలు, భజనలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు తొలి ఏకాదశి విశిష్టతను వివరించారు. ఆషాఢ మాసం శుక్లపక్ష ఏకాదశి రోజున విష్ణుమూర్తి పాల కడలిపై యోగ నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశి అంటారని తెలిపారు. ఈ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడం ద్వారా సకల శుభాలు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

**- రంగారెడ్డి జిల్లా న్యూస్ నెట్‌వర్క్**



చేవెళ్లటౌన్ : లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు



షాద్‌నగర్‌టౌన్ : వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



యాచారం : మాల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



ఆమనగల్లు మున్సిపాలిటీలోని పీర్ల చావిడి వద్ద..

# మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

**ఇంటింటికీ పీర్ల ఊరేగింపు.. అనంతరం నిమజ్జనం**

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా మొహర్రం వేడుకలను మతాలకతీతంగా నిర్వహించారు. హిందూ, ముస్లిం సోదరులు గత పది రోజులుగా రాత్రి పూట పీర్ల వద్ద నిప్పుల గుండం చుట్టూ ఉత్సాహంతో దుంకుతూ అలావ్ ఆడారు. పీర్ల వద్ద ముస్లిం మత పెద్దలు, నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుధవారం డప్పు చప్పుళ్లు, సంప్రదాయ నృత్యాల మధ్య పలు రకాల పీర్లను ఊరేంపుగా ఇంటింటికీ తీసుకెళ్లగా.. భక్తులు పీర్లకు కుడుకలు, మాలింగ ముద్దలను, షర్బత్‌ను నైవేద్యంగా సమర్పించి చెల్లించుకున్నారు. పూలు, దట్టీలు సమర్పించారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. షర్బత్ అందజేశారు. మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని ప్రఖ్యాత జేపీ దర్గాలో ఎమ్మెల్యే ఛాదర్ సమర్పించారు. నిమజ్జనాల వద్ద తినుబండారాల దుకాణాలను ఏర్పాటు చేశారు. **- రంగారెడ్డి జిల్లా న్యూస్ నెట్‌వర్క్**



కొత్తూరు : ఛాదర్ తీసుకెళ్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఇబ్రహీంపట్నంరూరల్ : రాయపోల్‌లో పీర్ల ఊరేగింపులో..



చేవెళ్లరూరల్ : కౌకుంట్ల గ్రామంలో పీర్ల ఊరేగింపు



కడ్తాల్ : మక్తమాదారం గ్రామంలో పీర్ల ఊరేగింపు..



పెద్దఅంబర్‌పేట : తట్టిఅన్నారంలో పీర్లకు పూజలు



నందిగామ : చేగూరు దర్గాలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్



యాచారం : కుర్మిద్దలో పీర్ల ఊరేగింపు



షాద్‌నగర్‌టౌన్ : పీర్ల పూజలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు



పీహెచ్‌డీ పురస్కారం అందుకుంటున్న పరమేశ్వర్

## పీహెచ్‌డీ సాధించిన పరమేశ్వర్

యాచారం, జూలై 17 : ప్రతిభకు ఏదీ అడ్డురాదని నిరూపించాడు యాచారం గ్రామానికి చెందిన కొండాపురం యాదయ్య, పద్మ దంపతుల కుమారుడు పరమేశ్వర్. వీరిది పేద కుటుంబం అయినప్పటికీ మొదటి ప్రయత్నంలోనే పీహెచ్‌డీ పట్టా సాధించి శభాష్ అనిపించుకున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన పరమేశ్వర్ తల్లి సహకారం, అన్నల ప్రోత్సాహంతో ఎంతో కష్టపడ్డాడు. గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వర్ ఈ నెల 13న బెంగుళూరులో జరిగిన 15వ స్నాతకోత్సవ వేడుకలో గీతం విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందాడు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు కృషి చేసిన ప్రసిద్ధి చెందిన విశిష్ట ఇంజినీర్ సుధాంశుమణి సమక్షంలో పరమేశ్వర్‌కు పీహెచ్‌డీ పురస్కారం లభించింది. వైజాగ్ గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సువేందుకుమార్ సాహూ పరమేశ్వర్ డాక్టరల్ జర్నీకి మార్గదర్శకం వహించారు. యాంటీ డిప్రెసెంట్, యాంటీలిపిడెమిక్ డ్రగ్స్ ట్రిట్‌మెంట్‌లో నానోపార్టికల్–బేస్డ్ ట్రాన్స్‌డెర్మల్ డ్రగ్ డెలివరీపై దృష్టి సారించాడు. ఫార్మాస్యూటి కల్ సైన్సెస్ రంగంలో చెప్పుకోదగ్గ పురోగతించి సాధించాడు. పరమేశ్వర్ సాధించిన విజయానికి గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ క్యాంపస్ వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ, డైరెక్టర్ వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, ప్రిన్సిపాల్ రషీద్ శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వర్ విద్యారంగం, పరిశోధనలకు సహకరిస్తామని వారు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు
- మైనర్లకు వాహనమిచ్చినవారిపై కేసు నమోదు



మృతుడు కుమ్మరి విఘ్నేశ్(ఫైల్)

చేవెళ్ల రూరల్, జూలై 17 : క్రికెట్ ఆడుతామని వెళ్లిన నలుగురు మైనర్లు రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా, ముగ్గురికి గాయాలైన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటలకు శంకర్‌పల్లికి చెందిన బిసోల్ల అశోక్‌కుమార్‌కు చెందిన టయోటా కారు తీసుకొని నలుగురు మైనర్లు క్రికెట్ ఆడుతామని వెళ్లి శంకర్‌పల్లి నుంచి మోకిళ్ల వైపు వెళ్తున్నారు. అతి వేగంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో శంకర్‌పల్లికి చెందిన కుమ్మరి విఘ్నేశ్(16) అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి గాయాలు కావడంతో స్థానిక దవాఖానకు తరలించారు. మైనర్లకు వాహనం ఇచ్చిన అశోక్‌కుమార్‌పై, ఆ వాహనాన్ని నడిపిన మైనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



షాద్‌నగర్‌టౌన్ : సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజేఏసీ నాయకులు

## పండుగల సాయన్నకు ఘన నివాళి

తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా జిల్లాలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సాయన్న గొప్ప బహుజన వాది, నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, ప్రజల విముక్తి కోసం పోరాడిన గొప్ప యోధుడు అని కొనియాడారు. ఉన్నవారి నుంచి దోచుకొని లేనివారికి దానం చేశారని గుర్తు చేశారు. తరాలు మారినా ఆయన గొప్పతనం ఇంకా సజీవంగా ఉన్నదంటే ఆయన చరిత్ర విలువేంటో తెలుస్తుందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**- రంగారెడ్డి జిల్లా న్యూస్ నెట్‌వర్క్**



చేవెళ్లటౌన్ : నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

## రుణమాఫీకి నిబంధనలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్లటౌన్, జూలై 17 : రుణమాఫీకి ప్రభుత్వం రేషన్ కార్డు నిబంధనలు పెట్టడం సరికాదని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దేవుని శర్వలింగం మండిపడ్డారు. బుధవారం చేవెళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రుణమాఫీకి రైతులను గుర్తించేందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని.. ఎన్నికల ముందు చెప్పి ఇప్పుడు మోసపూరిత మార్గదర్శకాలతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒకే కుటుంబంలో సభ్యులందరికీ కలిసి రెండు లక్షల రుణమాఫీ అంటున్నారు.. ఉమ్మడి కుటుంబంలో ఒకే రేషన్ కార్డు ఉంటుంది.. అటువంటి వారికి ఒకరికే రుణమాఫీ వర్తిస్తుంది. దీంతో విభేదాలు, మనస్పర్థలు రావడంతో ఆ కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని వారు పేర్కొన్నారు.

## రెండోరోజూ రిలే నిరాహార దీక్ష

యాచారం, జూలై 17 : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి రెండో రోజుకు చేరింది. మండల కేంద్రంలో బైఠాయించిన కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందూనాయక్ మాట్లాడుతూ.. అప్పులు చేసి మధ్యాహ్న భోజనం వండిపెట్టిన కార్మికుల పట్ల ప్రభుత్వానికి కనికరం లేకపోవడం బాధాకరమన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



యాచారంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



దేవునిఎర్రవల్లి అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా సామగ్రిని అందించిన సత్యనారాయణరెడ్డి

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి**

చేవెళ్ల రూరల్, జూలై 17 : విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో క్రీడా ప్రతిభను చాటాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సత్యనారాయణరెడ్డి తన వంతు సహకారంగా సొంత నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లో కూడా ముందుండాలన్న సంకల్పంతో ఆటలకు సంబంధించిన వస్తువులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకుడు అరుణ్‌కుమార్, స్థానిక నాయకులు చంద్రయ్య, బక్కయ్య, జంగయ్య, రవి, వెంకటయ్య, శ్రీనివాస్, మల్లేశ్, విద్యార్థులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీసీఎం, ఆటో ఢీ.. ఒకరికి గాయాలు

నందిగామ, జూలై 17 : డీసీఎం, ఆటో ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన నందిగామ పాత జాతీయ రహదారిపై తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. షాద్‌నగర్ నుంచి నందిగామకు వస్తున్న డీసీఎం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న ఆటోను డీసీఎం ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆటోను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## నేటి నుంచి రైతు రుణమాఫీ

షాద్‌నగర్‌టౌన్, జూలై 17 : లక్షలోపు రైతు రుణమాఫీ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుణమాఫీ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడం జరుగుతుందని, రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల రైతు వేదిక భవనంలో ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్, అభ్యుదయ రైతులు, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, బ్యాంకు ప్రతినిధులు, వ్యవసాయాధికారులు పాల్గొంటారని తెలిపారు. రుణమాఫీ రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బాలికపై వీధి కుక్కల దాడి

మొయినాబాద్, జూలై 17 : వీధి కుక్కలు మూడేండ్ల చిన్నారిపై దాడి చేశాయి. గాయాలతో బయటపడ్డ చిన్నారిని దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన అమీర్‌గూడలో జరిగింది. అమీర్‌గూడ గ్రామానికి చెందిన మేకగూడం వెంకటేశం, సంతోష దంపతుల మూడేండ్ల కూతురు అఖిల మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. వీధి కుక్కలు ఒక్కసారిగా చిన్నారి తల, మెడ, వీపు, కాళ్లు చేతులపై కరిచాయి. చిన్నారి పెద్దగా ఏడవడంతో చుట్టుపక్కలవారు గమనించి కుక్కలను తరిమేశారు. వెంటనే నగరంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స అందించి ప్రాణాపాయం లేదని.. 11 రోజుల పాటు ఇంజక్షన్లు ఇప్పించాలని సూచించారు.

## ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై కేసు

**ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్లు.. పోలీసులకు ఎంపీవో ఫిర్యాదు**

పెద్దఅంబర్‌పేట, జూలై 17: భూదాన్ భూమిలో ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్లు కేటాయించిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై కేసు నమోదైంది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. తారామతిపేట గ్రామ రెవెన్యూ పరిధిలో 39 ఎకరాల భూదాన్ భూమి ఉన్నది. అందులో ఇండ్ల నిర్మాణాలకు అనుమతిలేదు. కానీ, 21 ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతిచ్చారు. గ్రామంలోనే కమర్షియల్ భూమిలో ఓ ఫంక్షన్ హాల్ నిర్మించగా.. దానికి కూడా అనుమతి ఇచ్చారు. మరోవైపు, బాటసింగారం గ్రామంలోని సింగరేణి కాలనీలోనూ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించారు. పన్నులు సైతం చెల్లించేలా చేశారు. దీనిపై ఎంపీవో విచారణ చేపట్టి.. డీపీవోకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఎంపీవో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.